కథ

# ఎదర ఇంక చావులుండవు!

మహీధర రామశాస్త్రి

మంచం మీద సాగోరి పుస్తకం చదువుకుంటూ ఉండగా ఫోను మ్రోగింది. లేచివెళ్లి ఫోను తీసి, 'హలో' అన్నాను.

'నమస్తే అంకుల్'

'ఎవరు?'

'బాగున్నారా అంకుల్?'

'ఆంటీ బాగున్నారా?'

'మాట్లాడుతున్నది ఎవరని అడుగుతూంటే...?'

'నేను మాట్లాడుతుంటాను. పోల్చుకోండి చూద్దాం... డాడీ ఆసుపత్రిలో ఉన్నారు. రెండు మాసాలుగా అనారోగ్యం. వెల్లూరు వెళ్లి తిరిగి వచ్చేశారు. ప్రస్తుతం...'

'అరె, ఎవరు మాట్లాడుతున్నారని అడగుతూంటే, చెప్పకుండా.. ఇలా కంఠం పోల్చుకోమనడం... ఇదేమన్నా రేడియోలో వార్తలు వినిపించే గొంతా?' - కొంచెం చిరాకుపడ్డాను.

'ఒకటి రెండు క్లూలు ఇస్తాను. నేను మీకు బాగా తెలుసు. నేను కూడా శాస్త్రినే--'

'అప్పయ్యశాస్త్రా?'

'కాదంకుల్.. నేను.. అభిరామ్ గారబ్బాయిని. కొండని!'

'ఓరి! నువ్వా! ఏవిటి న్నాళ్లకు అకస్మాత్తుగా...'

"క్షమించండి మావయ్యగారూ! బంధువులకీ, మిత్రులకీ దూరం అయిపోయాం. ఆ దూరాన్ని తగ్గించాలనే నా ప్రయత్నం.

'నీకు పెళ్లయిందా?'

'అయింది. నాకో కొడుకు. నేను టాటాలో పనిచేస్తున్నాను. నాన్నగారు కటక్ ఆసుపత్రిలో ఉన్నారు. రెండు కిడ్నీలు పోయాయని అంటున్నారు.'

'మీ చంద్రం ఎక్కడ?'

'వాడు కటక్‌లో పనిచేస్తున్నాడు. నాన్నగారి దగ్గర వాడూ అమ్మా ఉంటున్నారు.'

'చంద్రానికి పెళ్లయిందా?' 'లేదు మావయ్యగారూ. వాడు పెళ్లి వద్దనేశాడు.

'నాన్నగారిని మరి జాగ్రత్తగా చూసుకోండి'

అభిరామ్ 1970లో తొలిసారిగా మా యింటికి వచ్చి పరిచయం చేసుకున్నాడు. ఆ రాకకు కారణం అతని కూతురు పెళ్లి సందర్భం. నా మాటసాయం కోసం వచ్చాడు. పిల్లనివ్వబోతున్నది నా మిత్రుని కొడుక్కేను. ఆ అవసరమే లేకుంటే అలా వచ్చేవాడు కాదు.

మేమిద్దరం ఒకే కంపెనీలో ఒకే రకమైన ఉద్యోగాలు చేస్తున్నా, ఎన్నడూ 'హలో' అన్న పాపాన పోలేదు. అభిరామ్ నాకు సీనియరు. పెద్దాఫీసరు గారి వద్ద అతను, చిన్నాఫీసరుగారి వద్ద నేనూ పనిచేసేవాళ్లం.

వ్యావసాయక సమాజంలో ఆస్తి పాస్తులు, కులం మనుషుల్ని ఎడంగా ఉంచితే, పారిశ్రామిక సమాజంలో హోదాలు, జీతాలు మనుషుల్ని దూరం చేస్తాయి. ఒక ఇంక్రిమెంటు తేడా కూడా యిద్దరు సహోద్యోగుల్ని ఎడం చేయగలదు. మనుషులు సుబ్బారావులు -వెంకట్రావులుగా జీవించలేరు. ప్రోటోకాలు మనిషిని నీడలా వెంటాడుతూనే ఉంటుంది.

అభిరామ్ నాతోనే కాదు, జూనియర్లు ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. నమస్తే అంటే తలకూడా పంకించేవాడు కాదు.

అలాంటి అభిరామ్ కూతురు పెళ్లయిన దగ్గర్నుంచి మాత్రం నన్ను 'బావగారు' అనడం సాగించాడు.

రెండు సంవత్సరాలకి ఒకసారి ఇంటర్వ్యూలు జరిపి పదోన్నతులు ఇస్తూంటుంది కంపెనీ. అభిరామ్ సీనియరు కాబట్టి పదోన్నతిని పొందాడు. నాకు పదోన్నతి రాలేదు. అతని ఆఫీసుకి వెళ్లాను. కబుర్లలో అభిరామ్ అన్నాడు.

'ఎదర యింక పదోన్నతులు ఉండవు!'

అతని కళ్లలో ఎంతో తృప్తి, ఆనందం.

'వెర్రివాడా! చింతించకు. కాల చక్రనేమి క్రమంలో ప్రతి ఒకనికీ ఎదుగుదల ఉంటుంది, అనుకుని సరిపెట్టుకున్నాను.

ఆ క్షణంలో ఒడియా కవిత మనసులో మెదిలింది.

**బుఢ పరొాడ భొసి పడుఛి**
**సన పరొాడ హసూఛి**
**మఝిలా పరొాడ కొహూఛి**
**మొ సమయొ ఆసూఛి!'**

(పండిన తాటాకు జారిపడుతూంది
లేతాకు నవ్వుతూంది
మధ్యాకు అంటూంది-
నా సమయం సమీపిస్తుంది!')

'అధికారాంతము నందు
చూడవలదా ఆ అయ్య సౌభాగ్యముల్"

'మిత్రమండలి'ని ఏర్పరచుకుని, తెలుగువారంతా కులమతాల కతీతంగా సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు చేసుకుంటూ వుంటే, కులం కార్డు ప్రయోగించి దానిని రెండుగా చీల్చాడు అభిరామ్. మిత్రమండలి పగ్గాలు వైదిక సంఘం చేతిలోకి పోయాయి. మండలి ఫండ్సు రెండు లక్షల రూపాయలు అభిరామ్ ద్వారా పరకాంతార్పణం అయిపోయాయి.

తెలుగువారంతా కలిసివున్న రోజుల్లోనే బాలాజీ మందిరం కట్టుకున్నారు.

అభిరామ్ మందిర కమిటీని నిలువునా చీల్చి మరొక మందిర నిర్మాణాన్ని చేపట్టి చేతులు కాల్చుకున్నాడు.

ఒకసారి దివ్యజీవన సంఘం నుంచి ఒక స్వామిజీ ఊళ్లోకి వచ్చారు. ప్రాణాయామం, యోగాసనాలు నేర్చుకుని నలుగురికి నేర్ప సాగాడు. క్రమంగా శాఖ పెరిగి చిన్న ఆశ్రమం వెలిసింది. శాఖకు బ్యాంకులో ఖాతా తెరవబడింది. ఖాతాతో పాటు కమిటీ ఏర్పడింది. కమిటీలో ఆధిపత్య పోరు మొదలయింది. అభిరామ్ ఆటలు సాగలేదు. మరొక స్వామీజీని పట్టి, పోటీ ఆశ్రమాన్ని లేపి, సంఘ సభ్యులను రెండు చీల్చేడు అభిరామ్.

ఆఫీసరు పోస్టుకి ఇంటర్వ్యూలు జరిగాయి. అందరం హాజరయేం. అభిరామ్ ఆఫీసరయేడు. నాలాంటి జూనియర్లకు పదోన్నతి రాలేదు. ఎందుచేతనో, అభిరామ్‌కి అభినందనలు తెలిపేందుకు జూనియర్లు ఎవరూ సిద్ధపడలేదు.

'రాజకీయం చేసి పొందిన ప్రమోషను ఇది' అన్నాడు మూర్తి.

'హోదా కాదు ముఖ్యం, మనిషికి శీలం ముఖ్యం!' అన్నాడు సత్యనారాయణ.

'అభిరామ్ శీలానికొచ్చిన లోటేమిటి?' అన్నాను నేను.

'మీకు తెలియదా? ఫ్రండ్సందరూ అతడిని 'క్రీడాభిరామ్' అని పిలుచుకుంటారు.'

'అదేవిటలాఅంటారు? దివ్యజీవన..'

'ఔను. అందులో జేరాకనే అభిరామ్‌కి కృష్ణతత్వం బాగా అలవడింది.' అని ఓ నిముషం ఆగి, సత్యనారాయణ యిలా అన్నాడు-

'బాలుడు,బట్టబుర్ర, మోహనరావులు తెలుసు కదా?' అంటూ అయిదారుగురు మిత్రుల పేర్లు చెప్పి సత్యనారాయణ అర్థవంతంగా నాకేసి చూసాడు.

'తెలుసు.. అతగాడి భక్తులేకదా, వారంతా?'

'భక్తులు కనుకనే వారి యిళ్లలోకి.. అభ్యంతర మందిరాల్లోకి ప్రవేశించి, వారు లేనప్పుడు వారివారి భార్యామణులకు ప్రాణాయామాలు, యోగాసనాలు దగ్గరుండి సాధన చేయిస్తుంటాడీ గురుడు!'

సత్యనారాయణ ఎప్పుడూ ఇలాంటి మాటలు మాట్లాడడు. రంకు పురాణాల్లోకి దిగడుకదా అని భయపడ్డాను. నా భయాన్ని గమనించిన సత్యనారాయణ అన్నాడు కదా-

'అనుమానమయితే, మీ ఆఫీసులోని మిసెస్ థామస్‌ని అడగండి.'

మిసెస్ థామస్ మళయాళీ ఉద్యోగిని. మిస్టరు థామస్ "ఛిట్‌ఫండు" నడిపి, చాలా మందిని, ముంచేశాడు. వారంతా ఉద్రేకంతో వేడెక్కిపోయి, థామస్ అంతు తేల్చుకునేందుకు ఇంటి మీదకు వెళ్లినపుడల్లా ఒక్కొక్కరిని ఒక్కొక్క విధంగా శాంతబరచి, చల్లబరచి, త్రిప్పివంపి, భర్తను కాపాడుకోగలిగిన సత్యామణి! ఊరందరూ ఆమెకు పరిచయస్తులేను.

అభిరామ్ నుంచి మా అందరకూ ఆహ్వానాలు అందేయి. అతనింట్లో మా అందరికీ పార్టీ ఇచ్చాడు అందరూ హాజరయ్యారు. ఆ సందర్భంగా అభిరామ్ అన్నాడు.

'బ్రదర్స్! ఎదర యింక ఆఫీసర్సు పదోన్నతులుండవు'

''ఎందుకని?'' అడిగాడు సత్యనారాయణ.

'క్యాంపస్ సెలక్షన్స్ ద్వారా డైరెక్టుగా తీసుకుంటారు. ఛానల్ ప్రమోషన్సుని ఆపేస్తారు!'

బయటికొచ్చేక మూర్తి భయపడుతూ అన్నాడు-

'అభిరామ్ చెప్పింది నిజమౌతుంది అంటారా?'

సత్యనారాయణ వ్యంగ్యంగా యిలా అన్నాడు-

'తన రిటైరుమెంటు నాడు వీడ్కోలు సభలో అభిరామ్ ఏమంటాడో నన్ను చెప్పమంటారా?'

అందరం ఆసక్తిగా అతనికేసి చూసేం.

'ఎదర యింక కంపెనీ ఉండదు. పోటీ కంపెనీల ధాటికి తట్టుకోలేక మూతబడుతుంది!' అంటూ నవ్వేశాడు.

ఆ మాట మీద స్పందిస్తూ విజయన్ యిలా అన్నాడు.

'నెహ్రూ పోయేడు, ఇందిరాగాంధీ పోయింది, రాజీవ్ రాలిపోయేడు. దేశం

స్వగృహాఫుడ్స్
Swagruha® Foods
Opp : P.W.D.Grounds, M.G.Road, VIJAYAWADA - 10
Phone : 2475763, Fax : 0866 - 2480200.
Eluru Road (Canara Bank Building),
Near Vijaya Talkies, Vijayawada - 520 002. Ph : 6626253.
10/2, Arundelpet, Guntur - 522 002. Ph : 2235350.
Ramanayya Cooldrink Shop Centre, Opp. Reliance Fresh,
Vijayawada - 520 001. Ph : 0866 - 2565773
Visit us : www.swagruhafoods.net

ఆగిపోయిందా? ముందుకు సాగుతూనే ఉంది... సాగుతూనే ఉంటుంది!

కొండ ఫోను చేసి, ఒకనాడు చెప్పాడు

'నాన్నగారి దగ్గర నేనూ, తమ్ముడు, అమ్మ తప్ప మరెవరూ లేరు.. మీరొకసారి రాగలరా?'

నాకాశ్చర్యం కలిగింది. ఎందుకంటే అభిరామ్ కుటుంబం చాలా పెద్దదనీ, అన్నదమ్ములు- అక్కాచెల్లెళ్లు వారివారి పిల్లలు, మనవలు అంతా కలిసి వందమందని స్వయంగా అభిరామ్ గర్వంగా చెప్పాడు.

"అదేవిటి? మీది చాలా పెద్ద కుటుంబం కదా కొండా?' అన్నాను.

'నిజమే అంకుల్... కానీ డాడీ ఎప్పుడూ ఏ బంధువు ఇంటికీ తాను పోలేదు, మమ్మల్ని పోనీలేదు.' అంటూ బాధపడ్డాడు కొండ.

నిజమే కదా, వస్తూపోతూ వుంటేనే బంధుత్వాలు, ఇచ్చిపుచ్చుకుంటేనే స్నేహ సంబంధాలు! అభిరామ్ 'నన్ను ముట్టుకోకు, నా మాలకాకి' అన్నట్టుగా.. ఒకటా రెండా.. నలభై సంవత్సరాలు బంధువులకు దూరంగా బతికాడు.

నేను వెడదామనుకున్నా తీరిక లేక, శరీరం సహకరించక వెళ్లలేక పోయేను. ఇంతలో అంతా జరిగిపోయింది. అభిరామ్ పోవడం, దహనం అవడం కూడా అయిపోయింది.

శ్రాద్ధకర్మలు రాజమండ్రిలో పెట్టుకుంటే పదవరోజుకి అక్కడికివెళ్లి ఇరవై సంవత్సరాల తర్వాత అభిరామ్ భార్యను పరామర్శించాను.

'ఏవిటో అన్నయ్యగారూ! మీ బావ గారి గురించి మీకు తెలుసు కదా! రిటైరయ్యేక సైతం బంధువుల్ని చూద్దామంటే అంగీకరించ లేదాయన!' అంటూ బాధపడిందామె.

'వైద్యానికి బాగా డబ్బు ఖర్చయి ఉంటుంది.'

'ఏం చెప్పమంటారు? ఆయన నన్నూ పిల్లల్నీ కూడా నమ్మలేదు. ఎక్కడ ఏముందో.. ఏం చేసుకున్నారో ఆయనకే తెలియాలి మరి!

'అంకుల్ నదికి నడవండి. ధర్మోదకాలు పూర్తిచేసుకుని వద్దాం.' అన్నాడు కొండ.

జనంతో రేవు కిటకిటలాడుతూంది. ఎవరిదో ధర్మోదకాల కార్యక్రమం జరుగుతూంది. జనాలను తప్పించుకుంటూ అభిరామ్ కొడుకులిద్దరూ, పురోహితుడు, నేను రేవులో రెండో వైపుకి దిగాం.

'ఎవరో మహానుభావుడు, ధర్మోద కాలకు ఎంతమంది జనం వచ్చారో!' స్వగతంగా అనుకున్న నా మాటల్ని ప్రక్కనున్న అభిరామ్ రెండో కొడుకు చంద్రం వినేశాడు.

"నాన్నగారు బెడ్డుమీద ఉండగా ఒక్క బంధువు కూడా రాలేదు. మీరు తప్ప ఇవాళ ఎవరూ మా ప్రక్కన నిలబడలేదు! నాన్నగారు చివరిరోజున డైరీలో వ్రాసుకున్నది తల్చుకుంటే, ఎంతో బాధేస్తుంది!' అన్నాడు చంద్రం గద్గద స్వరంతో.

'ఏం రాసుకున్నారు?' అడక్కుండా ఉండలేకపోయేను.

బెక్కుతూ దెక్కుతూ చంద్రం ఇలా అన్నాడు.

**'డబ్బు లేకపోతే దరిద్రుడంటారు. సన్నిహితులు లేకపోతే అనాథ అంటారు!'**

'మనం పోయేక, కట్టుకున్న భార్యా పిల్లలు కాక, మరొక పది కళ్లు చమరిస్తే, మనం నిజంగా బతికినట్టు లెక్క!' కృష్ణశాస్త్రి గారన్న మాటలు నా మదిలో మెదిలాయి.

కొండ ధారాపాత్ర, శిల, వాసస్సు, మొలకలు వున్న తాటాకు బుట్టను నదిలోకి వదిలిపెట్టాడు. మునగాల్సినవి మునిగాయి, తేలాల్సినవి తేలాయి. పైనుంచి కొట్టుకు వస్తున్న పూలు నీటిమీద తేలుతూ రేవుకెదురుగా వచ్చాయి. చిత్రంగా ఆ పూలు అక్షరాకృతులను దాల్చాయి.

'ఇక ఎదర చావులుండవు!'

అభిరామ్ ప్రేతాత్మ సందేశంలా అనిపించి- నిజమే.. ఎదర ఇలాంటి చావులుండవు, ఉండకూడదు కూడాను.. అనుకుని, ఓ వేడి నిట్టూర్పు విడిచాను.

# జై...తెలుగుతల్లి

**గరిమెళ్ళ నాగేశ్వరరావు**

అ ఆల ఒంపు సొంపుల్లో ఒదిగిన వయ్యారం
పలుకులకి పరిమాళాన్నద్దినప్పుడు
పల్లకీలనెక్కి ఊరేగిన పసిడి వెలుగుల ప్రాభవం మనది.
జీవనదుల ప్రవాహ పారవశ్యంలో
అవని హరితవనమై చిగురుల చిరునవ్వు రువ్వినప్పుడు
ఆకలి తీర్చిన అన్నపూర్ణ.. ఈ అమ్మ.

త్యాగమూర్తుల తనువు లూయలలూగి
తెలుగు తేజాన్ని జగతికిచాటిన పుణ్యభూమి
పదకవితా పితామహుల గానంలో..
కూచిపూడి పదనర్తన మువ్వల ధ్వానంలో...
ఖండాంతరాలు దాటిన ఘనకీర్తి మనది.
అగ్గిపెట్టెలో ఒదిగిన ఆరుగజాల చీరలా
దేశంలో ఒదిగిన రాష్ట్రం మనది.
ఉపగ్రహాల పరిభ్రమణానికి...
చంద్రునిపై యానానికి..
శ్రీకారం చుట్టిన ప్రాకారం.. ఇక్కడిది
పచ్చని పంటచేల చీరచుట్టి...
జలధారని జలతారుగ ధరించి...
కదులుతోంది అదిగదిగో తెలుగుతల్లి
తరతరాల మధురోహల కల్పవల్లి